## 305 రక్షకుని యొద్దకు రండి

రా – మారువ (చాయ : హలెలూయయని పాడుడీ) తా–ఆట

రండి మానవులారా – రక్షకునిన – మ్మండి వేగము ప్రియులారా = రండి పాపుల బ్రోచుటకు పర – మండలంబును విడిచి యీ భువి –మండలంబున కరుగుదెంచిన– మహాత్మున్ గనుగొని సుఖింపను ।।రండి।।

1. ఇలలో మానవులందరు – పలువిధ పాపా – శలలో మునిగి యుండిరి = తులువయగు సాతాను చెడ్డ – వలను జిక్కినవారలన్ దన – బలముతో విడిపింప బ్రాణము – బలిగబెట్టిన ప్రభుని యొద్దకు ।।రండి।।

2. పరముండు నరులందరికై – మరణంబయ్యె – కరుణతోడను కొరతపై = మరలి మూడవదినమునందున – మహిమతో నా ప్రభువులేచి – తెరవజేసెను మోక్షమార్గము – శరణు జొచ్చినవారలకును ।।రండి।।

3. పాపభారంబు నుండి – విడుదలనొంద – ప్రాపుగోరినవారలు = ప్రాప కుండగు క్రీస్తునాథుని – దాపుజేరి తపంబు జేసిన – పాపభారము దీసి శాంతిని గూర్చు – యా ప్రభు నొద్దకిపుడే ।।రండి।।

4. భావమందున దెలియుడి – మీరలు నిత్య – జీవమార్గము గనుడీ = పావనుండగు క్రీస్తు మిమ్మును – పావనులుగా జేసి నూతన – జీవము నొసంగి పరమున – జేర్చు మిమ్మును నిశ్చయముగా ।।రండి।।

– జి.జాన్ తాతయ్య

## 306 సువార్త

రా – ఆహిరి (చాయ : యేసువంటి ప్రియబంధుడు) తా–ఆది

పాపినినేనని – ప్రభుపదములకడ – ప్రార్థన సేయుము ఓ మనసా – పాపుల మిత్రుడు – ప్రభు యేసునికడ – పాపక్షమాపణ కలదో మనసా ।।పాపిని।।

1. నరుని స్వనీతిచే – దొరుకదు మోక్షము – నరులను జూడకు యో మనసా – ధరనొక పుణ్యుడు – దరచినలేదని – పరమవేదములో గలదో మనసా ।।పాపిని।।



2. జపతపములు మరి – యుపవాసములును – ఉపయోగింపవు ఓ మనసా – నెపముల జెప్పెదు – అపవాదిని విడి – కృపవాదినిగని బ్రతుకో మనసా ।।పాపిని।।

3. మానని ప్రేమచే – మనుజుల బ్రోవగ మానవుడయ్యెను ఓ మనసా మానుగ గల్వరి – మ్రానిపై యేసుడు – ప్రాణము నొసగెను ఓ మనసా ।।పాపిని।।

4. మరణము నొందియు – మరల సజీవుడై – మనుజుల కగుపడెనో మనసా – మరణ బంధముల – బరిమార్చిన ప్రభు – సరిరక్షకు లిక లేరిల మనసా ।।పాపిని।।

5. మార్పును బొందక – మలిన తరుణము – మరల లభింపదు ఓ మనసా – తీర్పుకాలమున తీర్పరి క్రీస్తని – తిరముగ నమ్ముము యేసుని మనసా ।।పాపిని।।

– ఎస్.జె.మోజెస్

## 307 యేసుక్రీస్తు సమాధానకర్త

హే ప్రభుయేసు – హే ప్రభు యేసు – హే ప్రభు దేవసుతా = సిల్వధరా, పాపహరా, శాంతికరా ।।హే ప్రభు।।

1. శాంతి సమాధానాధిపతీ – స్వాంతములో ప్రశాంతనిధీ = శాంతి స్వరూపా, జీవనదీపా – శాంతి సువార్తనిధీ ।।సిల్వధరా।।

2. తపములు తరచిన నిన్నెగదా – జపములు గొలిచిన నిన్నెగదా = విఫలులు జేసిన విజ్ఞాపనలకు – సఫలత నీవెగదా ।।సిల్వధరా।।

3. మతములు వెదకిన నిన్నెగదా – వ్రతములు గోరిన నిన్నెగదా = పతి తులు దేవుని సుతులని నేర్పిన – హితమతి వీవెగదా ।।సిల్వధరా।।

4. పలుకులలో నీ శాంతి కథ – తొలకరి వానగ గురిసెగదా = మలమల మాడిన మానవహృదయము – కలకలాడెకదా ।।సిల్వధరా।।

5. కాననతుల్య సమాజములో – హీనత జెందెను మానవత = మానవ మైత్రిని సిల్వపతాకము – దానము జేసెగదా ।।సిల్వధరా।।

6. దేవుని బాసిన లోకములో – చావుయె కాపురముండెగదా = దేవునితో సఖ్యంబును జగతికి – యీవి నిడితివి గదా ।।సిల్వధరా।।